بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 26.04.2019 (Telugu)**

# ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బద్రి అనుచరుల సద్గుణముల ఆసక్తికర ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ ముఅమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 26.04.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి. గత ఖుత్బాలో నేను హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ గురించి ప్రస్తావించుచు వారు జన్నతుల్ బఖీలో సమాధి అయిన మొదటి వ్యక్తి అని ప్రస్తావించితిని.

జన్నతుల్ బఖీ శంకుస్థాపన, ఆరంభము గురించి లభించిన కొంత సమాచారము ఇట్లు గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు చేరుకున్న తర్వాత అక్కడ చాలా స్మశానములుండెను. యూదుల తమ స్వంత స్మశానముండెను. అరబ్బుల వివిధ తెగల తమ తమ స్మశానవాటికలుండెను. మదీనా తయ్యిబహ్ అప్పుడు విభిన్న ప్రాంతములలో వ్యాపించియుండెను. కావున ప్రతి తెగవారు తమ తమ ప్రాంతములోనే తమ మృతులను సమాధి చేసేవారు. ఖబాకు విడిగా తన స్మశానవాటిక యుండెను. ఇది చాలా ప్రసిద్ధి చెందియుండెను. ఇంకా అక్కడ చిన్న చిన్న అనేక స్మశానవాటికలుండెను. బనూ జఫర్‌నకు తమ స్మశానవాటిక యుండెను. బనూసల్మాకు కూడ విడిగా స్మశానవాటిక యుండెను. ఇతర స్మశానవాటికలలో బనూ సా'దహ్ స్మశానవాటిక యుండెను. అది తర్వాత సూఖున్నబి (నబీ బాజార్) ఏర్పడెను. మస్‌జిద్ నబ్వీ నిర్మించిన చోట ఖర్జూర వృక్షముల మధ్య అన్యారాధకుల కొన్ని సమాధులుండెను. ఈ స్మశానవాటికలన్నిటిలో బఖీవుల్ ఘర్కద్ అన్నిటి కంటే పురాతనమైనది, ఇది ఎక్కువ ఖ్యాతి గడించెను. అనంతరం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దీనిని ముస్లిముల సమాధి స్థలముగా ఎన్నుకొనిరి. అనంతరం దానికి ఇప్పటి వరకు ఒక ప్రత్యేక, విశిష్ట గౌరవము లభించినది. ఆ గౌరవము సదా యుండును.

హజ్రత్ ఉబైదుల్లాహ్ బిన్ అబీ రాఫి ఇట్లు ఉల్లేఖించిరి. ముస్లిములు మాత్రమే సమాధి చేయబడుటకు ఒక స్థలమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అన్వేషించుచుండిరి. ఇందుకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వివిధ స్థలములను పరిశీలించిరి. కాని ఈ సత్కారము బఖీవుల్ ఘర్కద్‌నకు లభించెను. ఈ స్థలమును ఎన్నుకోవాలని నేను ఆదేశించబడ్డానని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. అక్కడ అందరికంటే మొదట హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ సమాధి చేయబడిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి సమాధి తల భాగాన గుర్తింపుగా ఒక రాయిని పెట్టి, వీరు మనకు మార్గదర్శకులని అనిరి. వారి తర్వాత ఎవరు మృతి చెందినా వారిని ఎక్కడ సమాధి చేయాలని ప్రజలు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అడగ్గా మన మార్గదర్శకులు ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ సమీపములో అని వారు సల్లల్లాహు అలైహి వసల్లం సమాధానమిచ్చేవారు. అధికంగా వృక్షములు యున్న చోటును అరబ్బిలో బఖీ అంటారు. మదీనా తయ్యిబహ్‌లో ఈ స్థలమును బఖీవుల్ ఘర్కద్ పేరున గుర్తు చేసుకునేవారు. ఎందుకనగా అక్కడ ఘర్కద్ వృక్షములు ఎక్కువ యుండెను. ఇంకా అక్కడ ఇతర ఎడారి చెట్లు కూడ పెద్ద సంఖ్యలో యుండెను. హజ్రత్ సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ తమ తండ్రి చే ఇట్లు తెలిపిరి. ఎవరైనా మృతి చెందినప్పుడు ఇంతకుముందు మృతి చెందిన వారి చెంతన వీరిని సమాధి చేయాలని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించేవారు. ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ నా సమాజములో చాలా మంచి మార్గదర్శిగా యుండెను. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ ఇట్లు తెలిపిరి. ఉస్మాన్ మృతి చెందినప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి పార్థివదేహం వద్దకు వచ్చిరి. మూడు సార్లు వారు వారిపై వంగి, తల లేపి, గట్టిగా ఇట్లనిరి. ఓ అబూ సాయిబ్! అల్లాహ్ నిన్ను క్షమించుగాక! ప్రపంచములోని ఏ వస్తువుతో మలినము కాకుండానే నీవు ప్రపంచాన్ని వీడి వెళ్లిపోతివి.

హజ్రత్ ఆయిషా రజి. ఇట్లు తెలిపిరి. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ పార్థివదేహాన్ని ఆంహుజూర్ సల్లల్లాహు

అలైహి వసల్లం ముద్దాడిరి. అప్పుడు వారు కన్నీరు కార్చుచుండిరి. హజ్రత్ ఆయిషా రజి. ఇట్లు తెలిపిరి. హజ్రత్ ఉస్మాన్ చెంపలపై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కన్నీరు ప్రవహించుచుండగా నేను చూచితిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కుమారులు ఇబ్రాహీమ్ మృతి చెందినప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. الحق بسلفنا الصالح عثمان ابن مظعون అనగా గతించిన ఉస్మాన్ బిన్ మజ్‌వూన్‌ను వెళ్లిభేటి అగుము. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ ఇట్లు తెలిపిరి. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ జనాజ నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం చదివించిరి. వారి కొరకు నాలుగు తక్బీర్లు పలికిరి. ముత్తలిబ్ ఇట్లు తెలిపిరి. ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ మృతి చెందినప్పుడు వారి జనాజ తీసుకొని వెళ్లి, వారిని సమాధి చేయబడెను. అప్పుడొక రాయి తీసుకొని రావాలని నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఒక వ్యక్తికి సూచించిరి. అది పెద్ద రాయి అయినందున అతడు ఆ రాయిని లేపలేక పోయెను. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని వద్దకు వెళ్లి తమ రెండు చేతుల పై నుండి చొక్కా లేపిరి. అనంతరం ఆ రాయిని వారు ఎత్తుకొని దానిని హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ తలాపున పెట్టి, ఇట్లనిరి. ఈ చిహ్నము ద్వారా నా సోదరుని సమాధిని గుర్తించగలను. నా కుటుంబములోని ఎవరు మృతి చెందినా వారిని ఇతని సమీపములో సమాధి చేయుదును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ మృతి గురించి తెలిపిన విషయములలోని కొన్నిటిని నేను ప్రస్తావింతును. వారిట్లనిరి. హిజ్రి 2వ సం॥ చివరలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరుల కొరకు మదీనాలో ఒక ఖబ్రస్తాన్ (స్మశానవాటిక)ను కేటాయించిరి. దానిని జన్నతుల్ బఖీ అందురు. అనంతరం అనుచరులు దాదాపు ఇదే ఖబ్రస్తాన్‌లో సమాధి చేయబడేవారు. అందరికంటే ముందు ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ ఈ ఖబ్రస్తాన్‌లో సమాధి చేయబడిరి. ఉస్మాన్ ఆరంభ ముస్లిములలో ఒకరు. చాలా ఆరాధకులు, సన్యాస స్వభావికులు. ఇస్లాంలో చేరిన తర్వాత ఒక సారి వారు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లనిరి. నేను పూర్తిగా ప్రపంచమును వీడి, భార్యా పిల్లలతో దూరమై దైవారాధన కొరకు నా జీవితమును కేటాయించదలచితిని. కాని ఇందుకు వారు అనుమతించలేదు. ఏది ఏమైనప్పటికి ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ మృతితో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు చాలా దుఃఖము కలిగెను. హదీసుల ప్రకారము వారి మృతి తర్వాత వారు వారి నుదుట ముద్దాడిరి. అప్పుడు వారి కన్నీరు ప్రవహించుచుండెను. వారిని సమాధి చేసిన తర్వాత గుర్తుగా ఒక రాయిని వారి సమాధి వద్ద పెట్టిరి. అనంతరం వారు అప్పుడప్పుడు జన్నతుల్ బఖీని సందర్శించి వారి కొరకు దుఆ చేసేవారు. మదీనాలో మృతి చెందిన మొదటి వలసదారుడు ఉస్మానే.

ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ మృతిపై వారి సతీమణి ఒక శోక పద్యము వ్రాసిరి. దాని అనువాదమిట్లు గలదు. ఓ కన్ను! తన సృష్టికర్త ప్రీతిని పొందుటకు తన రాత్రులను గడిపే వ్యక్తికి సంతాపముపై అనగా ఉస్మాన్ మృతి పట్ల నీవు నిరాటంకంగా కన్నీరు కార్చుము. ఒక నిరుపమాణ వ్యక్తి సమాధి చేయబడినందున ఆ ఖబ్రస్తాన్‌కు శుభవార్త! బఖీ, ఘర్కద్ తన నివాసి వలన ఇప్పుడు పవిత్రమైనది. వారు సమాధి చేయబడినందున దాని భూమి ఇప్పుడు ప్రకాశించుచున్నది. వారి మృతి వలన నా హృదయము ఎంతగా గాయపడినదనగా తుది శ్వాస వరకు అది మానదు, నా ఈ పరిస్థితి మారేటట్లు లేదు.

హజ్రత్ ఉమ్మె అలా ఇట్లనిరి. ఓ అబూ సాయిబ్! నిన్ను అల్లాహ్ కరుణించుగాక! అల్లాహ్ తప్పక నీకు గౌరవము ప్రసాదించెను అని నేను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎదుట సాక్ష్యమిచ్చితిని. బదులుగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఉస్మాన్ వాస్తవానికి మృతి చెందెను. నేను వారి కొరకు మేలునే ఆశించుచున్నాను. అల్లాహ్ తఆలా వారిని గౌరవించుననే ఆశించుచున్నాను. కాని అల్లాహ్ ప్రమాణముగా వారింకా ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణముగా! ఉస్మాన్‌తో ఎలా వ్యవహరించబడునో నాకు కూడ తెలియదు. దుఆ తప్పక చేయుచున్నాను. నేను అల్లాహ్ ప్రవక్త అయినను అల్లాహ్ వారికి తప్పక గౌరవము ప్రసాదించెనని నేను చెప్పలేను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది కూడ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సంస్కరణ పద్ధతి. అనగా ఇలా అల్లాహ్ తఆలా క్షమాపణ గురించి సాక్ష్యమివ్వకూడదు. కాని స్వప్నములో హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ సత్కర్మలు ఒక చెలిమ రూపంలో చూపబడినప్పుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ విషయమును ధృవీకరించిరి.

ఈ బద్రి అనుచరులతో అల్లాహ్ తఆలా ఇష్టపడిన విషయము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసి యుండెను. స్వయముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దుఆలు, వారి గురించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వ్యక్తపరచిన తమ భావాల ద్వారా అల్లాహ్ తఆలా వారి దుఆలను ఆమోదించునని, అల్లాహ్ తఆలా సామీప్యము పొందుననే విషయము తెలుస్తున్నది. అయినను మీరు ఒకరి గురించి ఇలా సాక్ష్యమివ్వలేరని వారు సూచించిరి.

ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్‌లో ఈ విషయమిట్లు ప్రస్తావించబడినది. ఖారిజ బిన్ జైద్ తమ తండ్రి ద్వారా ఇట్లు ఉల్లేఖించిరి. వారిట్లు తెలిపిరి. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ మృతి చెందినప్పుడు ఖారిజ బిన్ జైద్ తల్లి ఇట్లనిరి. ఓ అబూ సాయిబ్! నీవు పవిత్రుడవు. నీ మంచి రోజులు చాలా మంచిగుండెను. నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయములను విని ఇట్లనిరి. ఆమె ఎవరు? అవును నేను అని వారు బదులిచ్చిరి. నీకు ఈ విషయము ఎలా తెలిసినది? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. నేనిట్లు బదులిచ్చితిని. ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం! ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ కర్మలు, ఆరాధనలను చూచి అల్లాహ్ తఆలా తప్పక వారిని క్షమించునని నేను భావించితిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఉస్మాన్ బిన్ మజ్‌వూన్‌లో మేము మేలు తప్ప మరేమి చూడలేదు. కాని వెంటనే ఇట్లనిరి. నేను అల్లాహ్ ప్రవక్తను అయినా నాతో ఏమి జరుగునో నాకు కూడ తెలియదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను మించిన ఆరాధాకులెవరు లేరు. వారు దైవ ప్రియులు. కాని అల్లాహ్ స్వయంభువుడైనందున అతని పట్ల భక్తి, భయము ఎంతగా వుండెననగా నాతో ఎలా వ్యవహరించబడునో నాకు కూడ తెలియదని తమ గురించి వారు స్పష్టం చేసిరి. అలాంటప్పుడు మనమెంత భయపడవలసిన, మనమెంత చింతించవలసిన అవసరమున్నదో గమనించగలరు. కావున అల్లాహ్ కరుణించి, అనుగ్రహించి మనందరిని క్షమించుటకు దైవారాధన వైపు శ్రద్ధ చూపగలరు, వినమ్రతలో ముందడగు వేయగలరు, అల్లాహ్ తఆలా కరుణ, అతని శుభమును సదా యాచించుచుండుము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హజ్రత్ వహబ్ బిన్ సాద్ బిన్ అబీ సరహ్. వీరు బనూ ఆమిర్ బిన్ లూయి తెగకు చెందినవారు. హజ్రత్ వహబ్ సోదరుడు అబ్దుల్లాహ్ బిన్ అబీ సరహ్ దైవవాణి లేఖకునిగా పని చేస్తుండగా ఇస్లాంను వీడెను. అతని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజి ఇట్లనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎప్పుడైనా ఏదేని దైవవాణి అవతరించినచో అతణ్ణి పిలిపించి వ్రాయించు కునేవారు. ఒక రోజు వారు అల్‌ముమినూన్ అధ్యాయములోని 14,15వ సూక్తులు వ్రాయించుచుండిరి. వారు ثُمَّ اَنْشَاْنٰهُ خَلْقًا اٰخَرَ వరకు చేరుకున్నప్పుడు దైవవాణి లేఖకుని నోట అనుకోకుండానే فَتَبٰرَكَ اللّٰهُ اَحْسَنُ الْخٰلِقِيْنَ అను పదములు వెలువడెను. దైవవాణి కూడ ఇలాగే అందినది. కావున వీటిని కూడ వ్రాయుమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనితో అనిరి. నా నోట వెలువడిన పదములను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దైవవాణి అన్నట్లే నవూజుబిల్లాహ్ వీరే స్వయంగా కల్పితముగా పవిత్ర ఖుర్ఆన్ వ్రాయించుచున్నారని అతడు భావించెను. ఈ విధంగా అతడు ఇస్లాంను వీడెను.

ఆసిమ్ బిన్ ఉమర్ ఇట్లు ఉల్లేఖించిరి. హజ్రత్ వహబ్ మక్కా నుండి మదీనాకు ప్రస్థానము చేసినప్పుడు వారు హజ్రత్ కుల్సూమ్ బిన్ హదమ్ గృహములో బస చేసిరి. హజ్రత్ వహబ్-హజ్రత్ సువైద్ బిన్ అమర్ మధ్య హజ్రత్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సోదరభావమును ఏర్పాటు చేసిరి. వీరిద్దరు మౌతా యుద్ధములో అమరులైరి. హజ్రత్ వహబ్ బదర్ యుద్ధముతో పాటు ఉహద్, ఖందక్, ఖైబర్ యుద్ధములలో పాల్గొనిరి. అమరులైనప్పుడు వారి వయసు 40 సం॥లుండెను. మౌతా యుద్ధము జమాదివుల్ ఊలా హిజ్రి 8వ సం॥లో సంభవించెను. హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్‌ను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దూతగా నియమించి ఒక ఉత్తరమిచ్చి బస్రా రాజు వద్దకు పంపిరి. వారు మౌతా అనే ప్రాంతమునకు చేరుకున్నప్పుడు వారిని షర్‌హబీల్ బిన్ హమ్మాని బిన్ అమర్ ఘస్సాని అడ్డుకొని హతమార్చెను. ఈ సమాచారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు చేరగా ఇందుకు వారు చాలా బాధ పడిరి. కావున వారు యుద్ధము కొరకు ప్రజలకు పిలుపునిచ్చిరి. సుమారు మూడు వేల సంఖ్యలో ప్రజలు గుమికూడిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. వీరందరికి నాయకునిగా

హజ్రత్ జైద్ బిన్ హారిస యుందురు. ఒక తెల్లటి పతాకము సిద్ధము చేసి హజ్రత్ జైద్‌నకు అందించుచు ఇట్లు ఉపదేశించిరి. హారిస్ బిన్ ఉమైర్ హత్యకు గురైన చోటుకు చేరుకొని ప్రజలను ఇస్లాం వైపు ఆహ్వానించుము. వారు స్వీకరించినచో మంచిది. లేనిచో వారికి వ్యతిరేకంగా అల్లాహ్ తఆలాతో సహాయము యాచించుము. వారితో యుద్ధము చేయుము. హజ్రత్ వహబ్ కూడ ఈ యుద్ధములో పాల్గొనిరి.

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేను మృతి చెందిన కొందరి గురించి ప్రస్తావించి వారి జనాజ కూడ చదివింతును. వీరిలో మొదటి వ్యక్తి గౌ॥ మలిక్ ముహమ్మద్ అక్రమ్ మురబ్బి సిల్సిల గారున్నారు. 25 ఏప్రిల్ తేదీన మాన్చస్టర్‌లో వీరు మృతి చెందిరి. اناللہوانا الیہ راجعون. అతావుల్ ముజీబ్ రాషిద్ గారిట్లు వ్రాసిరి. అక్రమ్ గారు సద్గుణములు, చాలా మంచి అలవాట్లు కలిగియుండిరి. ఎంతో సత్యవంతులు, నీతి నిజాయతి పరులు, గొప్ప వినమ్రులు, త్యాగస్ఫూర్తిగా యుండిరి. మంచి ఉత్సాహము, బాధ్యతాయుతంగా సేవలందించేవారు. ఖిలాపత్ విధేయతలో ఎంతో ఉన్నత స్థాయికి చేరిన సేవకులుగా యుండిరి.

రెండవ జనాజ అబ్దుష్షుకూర్ ముబల్లిఘ్ సిల్సిల గారిది. వీరు చౌధ్రీ అబ్దుల్ అజీజ్ సియాల్కోటి గారి కుమారులు. ఏప్రిల్ 12వ తేదీన మృతి చెందిరి. اناللہوانا الیہ راجعون. మహ్మూద్ తాహిర్ గారు ఖాయిద్ అమూమి అన్సారుల్లాహ్ పాకిస్తాన్ ఇట్లు వ్రాసిరి. చాలా మౌనముగా సేవలందించేవారు. తమ పనిపై మాత్రమే దృష్టి సారించేవారు. మంచి సలహాలిచ్చేవారు. నాయిబ్ వకీలుత్తబ్షీర్ షేఖ్ ఖాలిద్ గారిట్లు వ్రాసిరి. వారు చాలా నిరాడంబరులు, సాదా మనస్కులు. చాలా సున్నితమైన స్వభావికులు. ఖిలాఫత్, సంస్థ పట్ల విశ్వసనీయులు, త్యాగస్ఫూర్తులు.

మూడవ జనాజ గౌ॥ ముహమ్మద్ సాలిహ్ ముహమ్మద్ ముఅల్లిమ్ వఖ్ఫె జదీద్ గారిది. వీరు 21 ఏప్రిల్ 2019వ తేదీన సహజ మరణము పొందిరి. اناللہوانا الیہ راجعون. వీరి మునితాత (తల్లి తరపున) అల్లాహ్ బఖ్ష్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు. సూర్య చంద్ర గ్రహణ సంకేతమును చూచి వీరు లోధ్రాం ప్రదేశము నుండి నడుచుకొంటూ ఖాదియాన్ చేరి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హస్తమున బైఅత్ చేయు అనుగ్రహము పొందిరి.

నాలుగవ జనాజ గౌ॥ మవేషె జుమా తన్జానియా గారిది. వీరు 13 మార్చిన మృతి చెందిరి. اناللہوانا الیہ راجعون. ఖిలాఫత్ పట్ల అమితంగా అభిమానము కలిగియుండిరి. గౌ॥ ముబల్లిఘీన్లు, జమాఅత్ హోదాదారులను చాలా గౌరవించేవారు. జమాఅత్ వ్యవస్థను గట్టిగా పాటించేవారు. ప్రచారము గురించి చాలా ఉత్సాహము, ఉల్లాసము కలిగియుండిరి. చందాల చెల్లింపులో ముందుండేవారు. అల్లాహ్ తఆలా వీరందరిని కరుణించి, క్షమించుచు, స్థాయి అంతస్థులను పెంచుగాక!

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................